క్లుప్తంగా

ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్‌గా కల్పన



జగిత్యాలటౌన్: ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్‌గా కె.కల్పన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సునీత బదిలీ అయ్యారు. కల్పనకు డిపో సిబ్బంది అభినందనలు తెలిపారు.

రేపు జిల్లాకు బీసీ కమిషన్ చైర్మన్ రాక

జగిత్యాల: జిల్లాకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఈనెల 26న రానున్నారు. రాత్రి ఇక్కడే బస చేయనున్నారు. 27న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జగిత్యాలలో.. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ధర్మపురిలో పర్యటించనున్నారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కేంద్రంలో డంపింగ్ యార్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. ధర్మపురిలో సేకరించిన చెత్తనంతా గోదావరి తీరంలోని శ్మశాన వాటిక వద్ద పోయడంతో చెత్తంతా గుట్టలు గుట్టలుగా పేరుకుపోతోందని, దీంతో దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. స్వచ్ఛ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంటే.. ధర్మపురిలో మాత్రం కనీసం డంపింగ్ యార్డును కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణం స్పందించి డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బండారు లక్ష్మణ్, బెజ్జారపు లవన్‌కుమార్, వైకుంఠం, రాయల్ల రవికుమార్, సురేందర్ తదితరులున్నారు.

యాదవుల్లో రాజకీయ చైతన్యం రావాలి

కోరుట్ల రూరల్: యాదవుల్లో రాజకీయ చైతన్యం రావాలని యాదవ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు గనవేణి మల్లేశ్‌యాదవ్ అన్నారు. నాగులపేటలో సోమవారం యాదవ సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కల్లూరు దేవయ్యయాదవ్, అంగ రాజలింగం, జాల అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మెట్‌పల్లి: మెట్‌పల్లి సీఐగా అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా ఉన్న నిరంజన్‌రెడ్డిని మూడు రోజుల క్రితం ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసి.. ఆయన స్థానంలో కరీంనగర్ ఎస్బీ సీఐగా పని చేస్తున్న అనిల్‌కుమార్‌ను నియమించిన సంగతి తెలిసిందే. సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మెట్‌పల్లిరూరల్: పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆత్మకూర్ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని పెద్ద వాగును రీచ్‌గా ఏర్పాటు చేయడంతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, దీంతో భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదముందని, రీచ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి ప్రారంభం

కోరుట్ల రూరల్: సంగెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు బావిని సోమవారం ప్రారంభించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.60లక్షలు మంజూరు కాగా.. పనులు పూర్తి చేసి బోరు బావిని ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, నాయకులు జక్కని గణేశ్, సుదవేణి భూమయ్య, మారు భూమారెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణం

మల్యాల: అడ్డరోడ్డు నుంచి కాసారం వరకు డబుల్ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రామన్నపేట గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రామన్నపేట గ్రామంలో జిల్లాపరిషత్ పాఠశాల నుంచి రామన్నపేట చౌరస్తా వరకు రోడ్డు వేసే క్రమంలో రోడ్డుకిరువైపులా సమాన కొలతలతో రోడ్డు వేయాల్సి ఉండగా.. ఒకవైపే రోడ్డు వేస్తుండడంతో నష్టపోతున్నామని పేర్కొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో సోమవారం ఉపాధిహామీ కూలీలకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగలకుండా తమను తాము ఎలా రక్షించుకోవాలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సిద్దార్థ, సుమలత పాల్గొన్నారు.



కనుల పండువగా పల్లకి సేవ

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీస్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు గుండి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తుల పల్లకి సేవను కనుల పండువగా నిర్వహించారు. హన్మాన్ భక్తుల శ్రీరామ నామ జపంతో ఆలయం సందడిగా మారింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భద్రాద్రి రాములోరి కల్యాణానికి తలంబ్రాలు

మెట్‌పల్లి: భద్రాదిలో జరిగే సీతారాముల కల్యాణ క్రతువులో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ఈ ఉత్సవానికి వినియోగించే బియ్యాన్ని తమవంతుగా సమర్పించే అవకాశం మెట్‌పల్లివాసులకు దక్కింది. స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం ముందుగా గణపతి, గౌరీ పూజలు చేసి.. ఆ తర్వాత శ్రీ రామ నామాలు జపిస్తూ వడ్లను ఒలిచి బియ్యం తీశారు. గుంటుక సుధారాణి, బచ్చు సుచరిత, లావణ్య, పూజ, వందన తదితరులున్నారు.



భూషణరావుపేట శివారులో హార్వెస్టర్‌తో వరి పంట కోత

వరి కోతలు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. వరి పంట ఎదిగి చేతికి రావడంతో హార్వెస్టర్లతో రైతులు పంటలు కోయిస్తున్నారు. పలు గ్రామాల్లో వరి పంట సాగు చేసిన రైతులు హార్వెస్టర్ల కోసం ఎదురుచూస్తున్నారు.

వానొచ్చినా.. గాలొచ్చినా కరెంట్ బంద్

- 4 దశాబ్దాలు దాటినా సమస్య తీరలే..
- నేరెళ్ల నుంచి 11.5కిలోమీటర్ల ప్రత్యామ్నాయ లైనుకు ఏర్పాట్లు

సారంగాపూర్: మండలానికి విద్యుత్ వచ్చి 40 సంవత్సరాలు దాటింది. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు లేని సమయంలో అప్పుడే సారంగాపూర్‌లో 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను విద్యుత్ శాఖ గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసింది. సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి, రేచపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని 18 గ్రామాలకు జగిత్యాల రూరల్ మండలం పొలాస మీదుగా 33/11 కేవీ లైనును ఈ మూడు సబ్ స్టేషన్లకు ఏర్పాటు చేశారు. మూడు సబ్ స్టేషన్లలో సమస్య ఏర్పడినప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు హైదర్‌పల్లి వద్ద ఫోర్ పోల్స్ స్విచ్ ఏర్పాటు చేశారు.

గాలి, వానతో విద్యుత్‌కు అంతరాయం

సారంగాపూర్, రేచపల్లి సబ్ స్టేషన్ల కింది గ్రామాలకు వర్షం పడితే విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఏ చిన్న గాలి వీచినా, వర్షం కురిసినా అటవీ ప్రాంతంలోని 33/11 కేవీ విద్యుత్ లైన్‌పై చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోతోంది. రాత్రిపూట వర్షం కురిస్తే ప్రజలు ముందుగానే తమ ఇళ్లలో దీపాలను సిద్ధం చేసుకుంటున్నారు. సారంగాపూర్ అటవీ ప్రాంతంలో వర్షం పడితే గాలివానతోపాటు స్మగ్లర్లు విచ్చలవిడిగా చెట్లను కొట్టడం, అవి ఎక్కువసార్లు తీగలపై పడి విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోతోంది.



సారంగాపూర్‌లో నేరెళ్ల నుంచి సరఫరా కోసం సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

సమస్యగా లైన్లు..

సారంగాపూర్, రేచపల్లి సబ్ స్టేషన్లకు వచ్చే 33/11 కేవీ విద్యుత్ లైన్లు పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉన్నాయి. సారంగాపూర్ లైన్ 3 కిలోమీటర్లు దట్టమైన అడవుల గుండా వెళ్లింది. వర్షం పడితే కలప స్మగ్లర్లు చెట్లను నరికి తీసుకెళ్లడం సులువు కావడంతో.. అదే సమయంలో చెట్లను నరికి తీసుకెళ్లి, మిగిలినది చెట్ల మీద వదిలిపెట్టి వెళ్లడంతో కొన్నిసార్లు లైన్లు తెగిపోవడం, స్తంభాలు విరిగి పడిపోతున్నాయి. రాత్రి వర్షంలో విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు టార్చ్ లైట్ల సహాయంతో విద్యుత్‌ను గంటల తరబడి శ్రమించి పునరుద్ధరించాల్సిన పరిస్థితి తరచూ ఏర్పడుతోంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి

చాలా సంవత్సరాలుగా సమస్యగా మారిన సారంగాపూర్ మండల విద్యుత్ లైన్లపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామ శివారులో నుంచి కొత్తగా అటవీ ప్రాంతానికి దూరంగా సారంగాపూర్ సబ్ స్టేషన్ వరకు 33/11 కేవీ లైన్ కొత్తగా నిర్మాణం చేయడానికి విద్యుత్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. 11.5కిలోమీటర్ల పొడవుతో 33/11 కేవీ విద్యుత్ లైన్లకు ఏర్పాట్లు చేశారు. నేరెళ్ల మీదుగా బట్టపల్లి, పోతారం నుంచి సారంగాపూర్ సబ్ స్టేషన్‌కు నూతనంగా ఈ లైన్‌కు ఏర్పాట్లు చేపట్టారు. అదనంగా మరో 11 కేవీ విద్యుత్ లైన్ కూడా నేరెళ్ల నుంచి బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ లైన్లను అనుసంధానం చేస్తే.. కేవలం కిలోమీటర్ పొడవుతో 12 విద్యుత్ పోల్స్‌తో లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తిగా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే గృహావసరాలకు వినియోగించనున్నారు.



సారంగాపూర్ అటవీ ప్రాంతంలో వాన పడగా.. అర్ధరాత్రి సరఫరా పునరుద్ధరిస్తున్న సిబ్బంది(ఫైల్)

చాలా ఇబ్బంది పడుతున్నం



సారంగాపూర్ సబ్ స్టేషన్ కింది గ్రామాలకు ఏ చిన్న వర్షం పడినా, గాలి వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతంది. చాలా ఇబ్బంది పడుతన్నం. రాత్రిపూట ఇంకా దారుణంగా ఉంది. సమస్యను పరిష్కరించాలి.

– కాలగిరి మధుసూదన్, సారంగాపూర్

పనులు చేపడతాం

సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం తొలగించేందుకు ఉన్నతాధికారుల చొరవతో ఇటీవల నేరెళ్ల ప్రాంతం నుంచి 33/11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు ఎస్ఈ సాలియానాయక్, డీఈ గోపికృష్ణ, ఏడీఈ సింధుశర్మ సహకారంతో కన్‌స్ట్రక్షన్ అధికారులు సర్వే చేపట్టారు. సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం.

– ప్రవీణ్, ఏఈ, ట్రాన్స్‌కో, సారంగాపూర్



కథలాపూర్: పెగ్గెర్ల గ్రామ శివారులో ఎస్సారెస్పీ వరద కాలువ వద్ద రోడ్డు ఎత్తుగా.. వంతెన తక్కువ ఎత్తులో ఉండటంతో నీరు నిల్వ ఉండి గొయ్యిగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు. వరద కాలువ వంతెన వద్ద వాహనాలపై వచ్చేవారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు చొరవ చూపి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్, ఆర్అండ్‌బీ ఏఈ, కథలాపూర్, సెల్‌ఫోన్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కెపాసిటర్ల బిగింపుపై అవగాహన

సారంగాపూర్: ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులపై భారం పడకుండా విద్యుత్ శాఖ వాహనంలోనే తరలిస్తున్నామని ఎన్పీడీసీఎల్ ఏడీఈ సింధూశర్మ, ఏఈ శ్రీనివాస్ తెలిపారు. పొలంబాటలో భాగంగా సోమవారం బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం, కమ్మునూర్‌లో రైతులకు విద్యుత్ సమస్యలు, కెపాసిటర్ల బిగింపుపై అవగాహన కల్పించారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులే వాహనాలు సమకూర్చుకునేవారని, ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చుకోవడంతో రైతులపై ఆర్థికభారం పడేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు ఇబ్బంది లేకుండా తమ వాహనంలోనే తీసుకొచ్చి బిగిస్తామని తెలిపారు. ఏఈ శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

వరి విత్తనోత్పత్తి పరిశీలన



వరి పరిశీలిస్తున్న విద్యార్థినులు

జగిత్యాలఅగ్రికల్చర్: కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామంలో రైతు మిరియాల జలపతిరెడ్డి సాగు చేస్తున్న వరి విత్తనోత్పత్తి పొలాలను వ్యవసాయ విద్యార్థినులు రావేప్‌లో భాగంగా సోమవారం సందర్శించారు. వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు వెల్మల రాంరెడ్డి ఆడ, మగ వరి విత్తనాల పరపరాగ సంపర్కం వల్ల హైబ్రిడ్ విత్తనోత్పత్తి ఎలా జరుగుతుందో విద్యార్థినులకు వివరించారు. రిటైర్డ్ ఏఈవో వెంకట్‌రెడ్డి, రావేప్ విద్యార్థినులు సోని, జోష్నా, స్పందన, స్రవంతి, సత్య పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట



రైతులకు వివరిస్తున్న అధికారులు

మేడిపల్లి: మన్నెగూడెం సెక్షన్ విద్యుత్ శాఖవారి ఆధ్వర్యంలో సోమవారం దేశాయిపేట, గోవిందారం గ్రామాల్లో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. రైతులకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులను వాడాలని, విద్యుత్ ప్రమాదాల నివారణపై వివరించారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఏమైనా సమస్యలు లేదా సందేహాలుంటే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ఏడీఈ బి.రఘుపతి, ఏఈ బి.అశోక్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న విప్

ధర్మపురి: అకాల వర్షంతో పంట నష్టం వాటిల్లిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు సోమవారం విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ధర్మపురితోపాటు వెల్గటూర్, పెగడపెల్లి, గొల్లపల్లి, ఎండపల్లి మండలాల్లో వడగండ్ల వానతో సుమారు 3,378 ఎకరాల్లో పంట నష్టం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కలెక్టర్ ద్వారా వచ్చిన పంట నష్టం నివేదికను ముఖ్యమంత్రి, మంత్రికి వివరించామని తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని కోరారు.

ఆయిల్‌పామ్‌తో నిరంతర ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో లావణ్య

మల్లాపూర్: ఆయిల్‌పామ్ సాగు చేసిన నాలుగేళ్ల నుంచి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం పొందొచ్చని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. సోమవారం మొగిలిపేట రైతు వేదికలో ఉద్యాన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదుస్సులో మాట్లాడారు. హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్ అధికారి గణేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి వినీత, రైతులు జలపతిరెడ్డి, మహేశ్‌రెడ్డి, రమేశ్, పోతరెడ్డి, అంజయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50కోట్లు అందజేత



లబ్ధిదారులతో కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు నియోజకవర్గానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50కోట్లు అందజేశామని నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం 30 మందికి మంజూరైన రూ.12.41లక్షలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, నాయకులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మార్గం గంగాధర్, నాయిని సురేశ్, పన్నాల మాధవరెడ్డి తదితరులున్నారు.

అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే వేధింపులు



మాట్లాడుతున్న మల్లయ్య

మల్లాపూర్: అధికార పార్టీ నేతల ఒత్తిడితో తహసీల్దార్ వేధిస్తున్నాడని రైతుబంధు కమిటీ జిల్లా మాజీ సభ్యుడు దేవ మల్లయ్య(డీలర్) అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సారెస్పీ పునరావాస గ్రామమైన రత్నాపూర్‌కి చెందిన మా కుటుంబంతో సహా పది నుంచి పదిహేను కుటుంబాల పెద్దలు సుమారు 1975లో మొగిలిపేట శివారులోని 394 సర్వే నంబర్‌లో 32 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారన్నారు. అప్పటి పీవోటీ వంటి చట్టాలపై అవగాహన లేక 1978లో ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మా కబ్జాలోనే ఉన్న ఆ భూమిలో గొర్రెల షెడ్డును నిర్మించుకున్నామని అన్నారు. 394 సర్వే నంబర్‌లో అసైన్డ్ భూమిలోనే గొర్రెల షెడ్డు నిర్మాణం జరిగిందిని, ఇటీవల తహసీల్దార్ నోటీసులిచ్చి తొలగించుకోవాలని సూచించారన్నారు. అధికారుల ఆదేశాల మేరకు తొలగించిన గొర్రెల షెడ్డును 393 సర్వే నంబర్‌లోని మా సొంత భూమిలో తిరిగి ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. అధికారి పార్టీ నాయకులు డబ్బులు కావాలని ఒత్తిడి చేస్తున్నారంటూ తహసీల్దార్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. గొర్రెల షెడ్డు నిర్మాణ సమయంలో కూడా మధ్యవర్తులను పంపించి డబ్బులు తీసుకున్నాడన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, సీనియర్ నాయకుడు కాటిపెల్లి ఆదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరు



మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు

మల్లాపూర్: బీఆర్‌ఎస్ నాయకులను ప్రభుత్వం పోలీసులతో నిర్బంధించి వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేదని మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. కాటిపెల్లి ఆదిరెడ్డి, బద్దం అంజిరెడ్డి, బిట్ల నరేశ్, కొమ్ముల జీవన్‌రెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మణ్, నల్ల రాజేశ్వర్, దామెర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్ ఆవరణలో అంగన్వాడీ టీచర్లు

జగిత్యాలటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు అంగన్‌వాడీ టీచర్లు వినతి పత్రం అందజేశారు. ప్రతి నెల 5 లోపు వేతనాలు చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 2024 నుంచి పెండింగులో ఉన్న ఇంటి అద్దెలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఆశ కార్యకర్తలు

మల్యాల: అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశ కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా.. సోమవారం తెల్లవారుజామున జేఎన్‌టీయూ చెక్‌పోస్టు వద్ద బస్సుల్లో ఉన్న ఆశ కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జి.వనిత, డి.సుమలత, లత, ఎస్.సుజాత, జి.కల్యాణి తదితరులున్నారు.

మల్లాపూర్: తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించడంతోపాటు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని ఆరోగ్య కమిషనరేట్ ముట్టడికి తరలివెళ్తున్న ఆశ కార్యకర్తలను ఆదివారం అర్ధరాత్రి ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లయ, శిరీష, సరిత, భూదేవి, ప్రేమలత, లావణ్య, స్వప్న తదితరులున్నారు.

అసెంబ్లీ ముట్టడికి తరలిన నాయకులు



అరెస్టయిన నాయకులు

కథలాపూర్: రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రైతు ఐక్యవేదిక నాయకులు సోమవారం అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లారు. పోలీసులు రెండు రోజులుగా గ్రామాల్లో పర్యటించి రైతు ఐక్యవేదిక నాయకులపై నిఘా ఉంచారు. అయినా మండలానికి చెందిన బద్దం మహేందర్‌రెడ్డి, పుర్కుటపు సంతోష్‌రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, ముస్కు పవన్ సోమవారం అసెంబ్లీ వరకు వెళ్లారు. అసెంబ్లీ వైపు వెళ్లగానే అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు నాయకులు పేర్కొన్నారు. నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని మండల రైతు సంఘం నాయకుడు గడ్డం భూమారెడ్డి అన్నారు.

రాయికల్: ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలు రుణమాఫీ, పసుపుకు మద్దతు ధర, రైతు భరోసా అమలు చేయాలని రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న రైతు నాయకులు తురగ శ్రీధర్‌రెడ్డి, కుర్మ మల్లారెడ్డి, సూతరి తిరుపతి, బోడగం రాజు, జిల్లాల గంగారెడ్డి, నీలి తిరుపతి, ఓజ్జెల నరేశ్, కల్లెడ అశోక్, కుర్మా రామును పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.